నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,27 మే 2024


## స్పోకెన్ ఇంగ్లీష్‌పై విద్యార్థులకు బోధన



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురంప్రథమశ్రేణిశాఖా గ్రంధాలయంలోవేసవిశిక్షణాశిబిరంలోభాగంగాఆదివారం గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లీష్‌పై వివరించడంజరిగింది. అనంతరంఉపాధ్యాయులు ఆర్. వెంకటేశ్వరరావు విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక సమీక్ష చేయడం జరిగింది. ఈకార్యక్రమంలోవిద్యార్థులు,గ్రంధాలయ పాఠకులు వానపల్లి సత్యనారాయణ, ఎస్. వీరబాబు,దుర్గాప్రసాద్,సిబ్బంది సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని మాస్టర్ ట్యూషన్ సెంటర్ మహమ్మద్ రఫి తెలిపారు. చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో ఆదివారం మహమ్మద్ రఫి పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాలపై బోధించారు. 5వ తరగతి నుండి నవోదయ పరీక్షలకు విద్యార్థులు సిద్ధంకావడంతోనే, పోటీ పరీక్షలు ప్రారంభమవుతాయని, వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలలో విజయం సాధించాలని ఆయన తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు దుంగల పూజిత సూర్యశ్రీ కరాటే శిక్షణ, నీలపాల కృష్ణ కర్రసాము నేర్పించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, మంజుల, అమృత, సాయి, బంగారం, మణికంత, నేహ, రేణుక, రవి, పవన్, సాయిరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# త్రాగునీరు అందక అల్లాడుతున్న ప్రజలు

### -రాజకీయ నాయకుల కనుసన్నలలో పనిచేస్తున్న ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు-కర్నాకుల విమర్శ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ కేంద్రం జగ్గంపేట ప్రెస్ క్లబ్లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(APRCS) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో త్రాగునీటి సమస్యపై ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ జగ్గంపేట, గండేపల్లి మండలాల్లోని, గ్రామాల్లో త్రాగునీరు అందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ రెండు మండలాల ప్రజలకి శుద్ధిచేసిన మంచినీరు సప్లై చేయడానికి భావరం గ్రామంలో అధిక మొత్తంలో నిధులు వెచ్చించి ఫిల్టర్ బెడ్లు, ట్యాంకులు కట్టించారని, కానీ కరెంటు లేదనే సాకుతో శుద్ధి చేసిన నీళ్లు సప్లై చేయట్లేదని విమర్శించారు. గండేపల్లి మండలానికి త్రాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ లు పాడై పోయాయని, కాంట్రాక్టర్ యధావిధిగా తమ బిల్లులు తీసుకుని, ఫిల్టర్ బెడ్లు రిపేర్ చేయించకుండా, క్లోరినేషన్ చేయకుండా అధికారులతో కుమ్మక్కై కలుషిత నీటిని ప్రజలకు సరఫరా చేస్తూ ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్నారన్నారు. ఆ నీటిని కూడా మూడు రోజులకి, నాలుగు రోజులకు సరఫరా చేస్తున్నారని విమర్శించారు. భావరం గ్రామంలో ఒక భూస్వామి తమ పామాయిల్ తోటకు ఈ నీరును మళ్లించుకుంటున్నారన్నారు. కాంట్రాక్టర్ తక్కువ మంది సిబ్బందిని పెట్టుకుని పని చేయించుకుంటూ ఎక్కువమందికి జీతాలు రాసుకుంటున్నారని అన్నారు. గ్రామాలలో ప్రజలు నీళ్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. సంబంధిత అధికారులు, రాజకీయ నాయకులు , కాంట్రాక్టర్ ల కనుసన్నల్లో పనిచేస్తున్నారని, అధికారులు, కాంట్రాక్టర్ రాజకీయ నాయకులతో ఏకమై ప్రజలకు త్రాగునీరు అందించకుండా అవకతవకలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, జగ్గంపేట, గండేపల్లి మండలాల ప్రజలకు శుద్ధి చేసిన త్రాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌సిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, సహాయ కార్యదర్శి కడితి సతీష్ ఏఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, ఏపీ ఆర్‌సిఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టయోటా అర్బన్ క్రూజర్ "టైజర్" ఆవిష్కరణ




**రాజమండ్రి,మేజర్ న్యూస్ :** టయోటా కిర్లోస్కర్ మోటార్స్ వాహనాల యొక్క అధీకృత డీలర్ అయిన పృథ్వీ టయోట తమ రాజమండ్రి షో రూమ్ నందు సరికొత్త టయోట అర్బన్ క్రూజర్ "టైజర్" వాహన శ్రేణిని ఆదివారం ఆవిష్కరించడం జరిగింది. ఇది శక్తిశీలమైన, అదనపు బలమైన మరియు సమగ్ర పరిధి కలిగినటువంటి స్పోర్ట్స్ యుటిలిటి వాహనము. ఈ వాహనంలో 1.0 లీ. టర్బో, 1.2 లీ. డ్యుయల్ జెట్, డ్యుయల్ వివిటి పెట్రోల్ మరియు ఈ-సిఎన్‌జితో పాటుగా 5 స్పీడ్ మాన్యువల్ మరియు 6 స్పీడ్ ఆటో ట్రాన్స్మిషన్ కలిగి ఉంది. ఈ వాహనము నందు ప్రతిష్టాత్మకమైన మరియు ఎంతో సౌందర్యవంతమైన ఎక్స్‌టీరియర్‌తో పాటుగా అంచనాలకు మించినటువంటి ఇంటీరియర్స్‌ని కూడా కలిగి ఉన్నది. ఈ వాహనంలో వివిధ శ్రేణులలో 16" ఎల్లాయిస్, ట్విన్ ఎల్ఈడీ డిఆర్ఎల్, డ్యూయల్ టోన్ ఎక్స్టీరియర్, హెడ్ ఆఫ్ డిస్‌ప్లే, 9" హెచ్‌డి డిస్ప్లే, కాస్ట్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టం, 6 ఎయిర్ బ్యాగ్స్ వంటి అధునాతనమైన మరియు భద్రత ప్రమాణాలు కలిగియున్నది. ఈ వాహనం యొక్క శ్రేణి రూ. 7,73,500 నుండి ప్రారంభం అవుతున్నది. మైలేజ్ పెట్రోల్ వేరియంట్ నందు 22.8 కి.మీ./లీ., సిఎన్‌జి వేరియంట్ నందు 28.5 కి.మీ./కేజీ గా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమమునందు రాజమండ్రి డి.టి.వో. కె.ఎస్.ఎం.వి. కృష్ణారావు, టయోట ఏరియా మేనేజర్ శశికాంత్, పృథ్వీ మోటార్స్ ఎండి పృథ్వీ చంద్ర, సీఈవో కిరణ్ కుమార్ తోపాటు కంపెనీ సిబ్బంది మరియు ముఖ్య అతిథులు పాల్గొనడం జరిగింది.

## నూకాలమ్మ అమ్మవారి దర్శించుకున్న భక్తులు



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్** :పెద్దాపురంమండలం, కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ నూకాలమ్మఅమ్మ వారినిఆదివారం భక్తులుదర్శించు కున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా దేవస్ధానం కార్యనిర్వాహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో పలు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు, మజ్జిగ పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చంటి పిల్లలకు పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది మోహన్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు




**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్** :కోనసీమ తిరుమలవాడపల్లి వెంకటేశ్వర స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం తణుకు కు చెందిన నండూరి భాగ్యలక్ష్మి వారి కుటుంబ సభ్యులు రూ. 20 వేలు, విజయవాడ కు చెందిన జి.వి.ఎన్.ఎస్.ఆర్. కళ్యాణ్ వారి కుటుంబ సభ్యులు రూ. 10,116 లు, పాలచెర్లకు చెందిన కోరాడ యశస్విని వారి కుటుంబ సభ్యులు రూ. 10,116 లు, కాకినాడ కు చెందిన ముళ్ళపూడి నాగేశ్వరరావు, జయలలిత దంపతులు రూ. 10,116 లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సూపరింటెంట్ శ్రీనివాస్, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## ఆత్రేయపురంలో పేకాట శిబిరంపై దాడి

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** ఆత్రేయపురంగ్రామంలోపేకాట ఆడుతున్నారనే సమాచారంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 11,970 రూపాయలు స్వాధీనం చేసుకుని 8 సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. శ్రీనివాసు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పోలీస్ స్టేషన్ స్వీపర్ మృతి



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్** : స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా చేస్తున్న చల్లపల్లి ధర్మరాజు (63) ఆదివారం మృతి చెందాడు. నర్సాపురంలో అల్లుడు సంవత్సరికానికి ఉదయం వెళ్లిన ధర్మరాజు ఉన్నట్టుండి ఒక్కసారిగా అక్కడ ఛాతిలో నొప్పి రావడంతో ఆదివారం కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మరాజు గత 35 సంవత్సరాలుగా ఆత్రేయపురం స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందాడు. ధర్మరాజు మృతి పట్ల ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది, పలువురు గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

## చిరస్మరణీయుడు రఘుపతి వెంకటరత్నం నాయుడు

### - కాపు సద్భావనా సంఘం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సంఘసంస్కర్తగా, విద్యావేత్తగా, పవిత్రతకు సంకేతంగా బ్రహ్మర్షిగా భారతదేశంలోని తెలుగు ప్రాంతాల్లో పేరుపొందిన తెలగా నాయుడు రఘుపతి వెంకటరత్నం నాయుడు 85వ వర్ధంతి సందర్భంగా ఆంధ్రా కాపు సద్భావనా సంఘం తరపున గౌరవ ఆద్యక్షులు బసవా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శేతు మాధవరావు, దామిశెట్టి శ్రీనివాసు తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా క్రీడా మైదానం వద్ద గల వేంకటరత్నం నాయుడు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాసు మాట్లాడుతు 1862 అక్టోబర్ 1 వ తేదీన మచిలీపట్నం లో జన్మించిన రఘుపతి వెంకటరత్నం నాయుడు కాకినాడ ప్రాంతంలో ప్రముఖ సంఘసంస్కర్తగా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. 1904లో పిఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి 1911 లో తొలిసారి కాకినాడలో బాలికలకు ప్రవేశం కల్పించిన ఘనత ఆయనదేనన్నారు. ఈ కార్యక్రమములో సంఘ కోశాధికారి కర్నాసుల సత్యనారాయణ, నిరంజన్ నాయుడు, కొప్పిశెట్టి శ్రీను, కోన ఉమేష్ మరియు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

### - రౌడీ షీటర్లను హెచ్చరించిన డిఎస్పీ బి.రామకృష్ణ



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌బి. రామకృష్ణ ఆధ్వర్యంలో,సర్కిల్ఇన్స్పెక్టర్ రామచంద్ర పురం బి.దొర రాజుసర్కిల్ ఆఫీస్ వద్ద సర్కిల్ పరిధిలోని రామచం ద్రపురం, ద్రాక్షారామం, పామర్రు పోలీస్ స్టేషన్‌లలో రౌడీ షీట్లు కలిగిన వారందరికీ కౌన్సిలింగ్ నిర్వహించారు. రాబోవు ఎలక్షన్స్ కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించుటకు గాను, చెడు నడత కలిగిన వీరు చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనకుండా, సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, అలాకాకుండా చట్టాన్ని ఉల్లంఘించి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొన్నట్లయితే అర్హత ఉన్నవారిపై నగర బహిష్కరణ, పిడియాక్ట్‌లువారిపై అమలుపరచడం జరుగుతు ందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.దొర రాజు, సర్కిల్ ఎస్ఐలు ఎస్ఐ రామచంద్రపురం కె.సురేష్ బాబు, ఎస్ఐ ద్రాక్షారామం జి.సురేందర్, ఎస్సై పామర్రు ఎస్.కె.జానీ భాష మరియు సిబ్బంది పాల్గొన్నారు.


## అన్నవరప్పాడు వెంకన్న ఆలయ ఆవరణలోని కళ్యాణమండపం దేవాదాయ శాఖకు అప్పగింత

### -ప్రశాంత వాతావరణంలో అప్పగింత కార్యక్రమం



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలోని అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో లోగడ ఆ గ్రామస్తుల లతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అన్నవరప్పాడు గ్రామానికి చెంది వివిధ రాష్ట్రాలలో పట్టణాలలో నివసిస్తున్న ప్రజల సహకారంతో తమ చందాలతో నిర్మించిన కళ్యాణమండపాన్ని ఎట్టకేలకు దేవాదాయ ధర్మాదాయ శాఖకు స్వాధీనం చేశారు అన్నవరపాడు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజల చందాలతో పది ఏళ్ల క్రితం ఈ కళ్యాణ మండపాన్ని భారీ స్థాయిలో నిర్మించారు ఈ కళ్యాణ మండపం నిర్వహణ విషయంలో 2018లో అప్పటి ఆలయ పాలకవర్గానికి గ్రామస్తులకు మధ్య వివాదం తలెత్తింది ఈ మండపాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించాలని అప్పటి ఆలయ పాలకవర్గం ప్రతిపాదించగా గ్రామస్తులు అందుకు అభ్యంతరం తెలిపారు అంతేకాకుండా గ్రామస్తుల తరఫున ఓసూరి బాలయోగి అనే వ్యక్తి హైకోర్టులో పిల్ వేసి మండపం దేవాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లకుండా స్టే తెచ్చారు నాటి నుంచి నేటి వరకు ఈ కళ్యాణ మండపంలో గ్రామస్తుల సమక్షంలో దాతల సహకారంతో ప్రతి శనివారం ఆలయానికి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు కాగా ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు పలుదపాలుగా గ్రామస్తులతో చర్చలు జరిపి గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈ కళ్యాణ మండపాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖకు స్వాధీనం చేసేలా వారిని ఒప్పించారు దాంతో హైకోర్టులో వేసిన పిటిషన్ ను ఓసూరి బాలయోగి స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నారు దీనితో దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఎం విజయరాజ్ మే 25వ తేదీ శనివారం అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చి గ్రామస్తుల సమక్షంలో ఈ కళ్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకున్నారు. భక్తులు దాతలు మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ కళ్యాణ మండపం అప్పగింత కార్యక్రమం ప్రశాంతంగా జరగటం పట్ల అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు కోరిక మేరకు ఇకపై కూడా ప్రతి శనివారం ఉచిత అన్నదానాన్ని ఇప్పుడు కొనసాగుతున్న విధంగా కళ్యాణ మండపంలో నిర్వహించేందుకు ఉప కమిషనర్ విజయరాజ్ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి సోమరాజు ఇన్స్పెక్టర్ జి సత్య వరప్రసాద్ ఈవోలు కే ఎన్ వి డి ప్రసాద్ చైతన్య ఏ సత్య వర్ధన్ రావు శ్రీనివాసరావు అన్నర్పాడు వెంకన్న ఆలయ కార్యనిర్వాహణాధికారి మీసాల రాధాకృష్ణ తోపాటు పోలీస్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు ఇప్పటివరకు కళ్యాణ్ మండపాన్ని నిర్వహించిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూము పరిశీలించిన పిఠాపురం ఆర్వో




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్ సుందర్ రెడ్డి.. ఆదివారం కాకినాడ జేఎన్టీయూ డా. బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రి స్ట్రాంగ్ రూమును సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూముకు పటిష్ట భద్రత కల్పించామన్నారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూము వద్ద అన్ని వైపులా కనిపించేలా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘాను పరిశీలించడం జరుగుతోందని ఆయన తెలిపారు.


### శ్రీ ములుకుట్ల అచ్యుతరామయ్య చారిటీస్ ట్రస్ట్

దేవాదాయ ధర్మాదాయశాఖ, కాకినాడ నగరం & మండలం, కాకినాడ జిల్లా

**భూమి కౌలు హక్కునకు టెండర్-కమ్-బహిరంగవేలం ప్రకటన**

కాకినాడ జిల్లా, కాకినాడ నగరం మరియు మండలంలో గల శ్రీ ములుకుట్ల అచ్యుతరామయ్య చారిటీస్ ట్రస్ట్ తాలూకు పిఠాపురం మండలము నందు గల యీ దిగువ పట్టికలో తెలియపర్చిన పల్లం భూములకు 2024-25 నుండి 2026-27 వరకు అనగా 3 సం॥ల కాలపరిమితికి కౌలు హక్కునకు టెండర్-కమ్-బహిరంగవేలం పాటలు ది.07-06-2024 అనగా శుక్రవారం దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల సమక్షమున నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పాట షరతులు వివరములు తెలుసుకొనుటకు సత్రం కార్యాలయం పనివేళలలో సంప్రదించవలెను.

| వ. నెం. | భూమి ఉన్న గ్రామం | సర్వే నెం. | విస్తీర్ణం య. ట్లు | పాట తేదీ సమయం | బహిరంగ వేలం |
|---|---|---|---|---|---|
| 1. | గోకివాడ గ్రామం, పిఠాపురం మండలం | 121/4 | 2-96 పల్లం | ది. 07-06-2024 ఉ. 9 గం.లకు | గోకివాడ గ్రామ పంచాయితీ వద్ద |
| 2. | కోలంక గ్రామం, పిఠాపురం మండలం | 325/9 | 1-50 పల్లం | ది. 07-06-2024 ఉ. 11.00 గం.లకు | కోలంక గ్రామ పంచాయితీ వద్ద |
| 3. | కంద్రాడ గ్రామం, పిఠాపురం మండలం | 49/8 | 2-12 పల్లం | ది. 07-06-2024 మ. 1.00 గం.లకు | కంద్రాడ గ్రామం రామాలయం వద్ద |

కాకినాడ,
ది.26-05-2024

సెల్ నెం. : 7799614333

సం/- కార్యనిర్వాహణాధికారి
ములుకుట్ల అచ్యుతరామయ్య చారిటీస్ ట్రస్ట్, కాకినాడ

### శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానం

దేవాదాయ ధర్మాదాయశాఖ, నడకుదురు గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా

**కౌలు హక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన**

కాకినాడ జిల్లా, కరప మండలం, నడకుదురు గ్రామములో వేంచేసియున్న శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానము యొక్క ఈ దిగువ తెలిపిన భూములు కౌలుకు సాగు చేసుకునే హక్కుకు 2024-25 సం॥ము ప్రథమ పంట నుండి 2026-2027 సం॥ము రెండవ పంట అగు 3 సం॥ములు మాత్రమే ది.10-06-2024వ తేదీ మధ్యాహ్నం గం.02.00 లకు శ్రీ స్వామివారి ఆలయం వద్ద దేవాదాయశాఖ అధికారులు సమక్షమున కౌలు హక్కుకు టెండర్-కమ్-బహిరంగ వేలం పాటలు జరుపబడును.

| వ. నెం. | గ్రామం | సర్వే నెం. | విస్తీర్ణం | పల్లం / మెరక | ధరావత్తు | సెక్యూరిటీ |
|---|---|---|---|---|---|---|
| 1. | నడకుదురు | 1/3 | 3-24 | పల్లం | 10,000/- | ఎటువంటి తగాయిదా లేని భూమి 3 సం॥ములు మక్తాకు |
| | నడకుదురు | 3/9 | 0-07 | పల్లం | | |
| | నడకుదురు | 46/3 | 0-23 | పల్లం | | |
| | నడకుదురు | 13/12 | 0-07 | పల్లం | | |
| | నడకుదురు | 28/2 | 0-09 | పల్లం | | |
| | | మొత్తం | 3-70 | | | |
| 2. | నడకుదురు | 35/7 సి | 1-38 | పల్లం | 3,000/- | |

మిగిలిన పాట షరతులు ఆఫీసు పనిచేయు కాలములో అడిగి తెలుసుకొనవచ్చును.

నడకుదురు
ది.26-05-2024

కార్యనిర్వాహణాధికారి

## హనుమాన్ జయంతి మహోత్సవాలు



**అంబాజీపేట, మేజర్‌న్యూస్ :** స్థానిక పశువుల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామివారి హనుమాన్ జయంతి వేడుకను వచ్చే నెల1 వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆలయ వద్ద పందిరి రాట ముహుర్తాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చంద్రమౌళి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే రోజున ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## జగ్గంపేటలో పర్యటించిన రాజు యాదవ్ సినిమా టీం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేటలో ఆదివారం రాజు యాదవ్ సినిమా టీం పర్యటించింది. సినిమా హీరో గెటప్ శ్రీను, హీరోయిన్ అంకిత ఖరత్, డైరెక్టర్ తదితర సినిమా బృందం జగ్గంపేటలోని కృష్ణవేణి థియేటర్లో ఆడుతున్న రాజు యాదవ్ సినిమా మార్నింగ్ షో కు విచ్చేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు అభిమానులతో కలిసి సినిమా చూశారు. అనంతరం చిత్రం విజయోత్సవం పురస్కరించుకొని థియేటర్ యాజమాన్యం బూర్లు సాయి ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. తొలుత హీరో హీరోయిన్లకు జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొని సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

## 'రెమాల్' తుఫాను సన్నద్ధతపై మోదీ సమీక్ష




**న్యూఢిల్లీ,మేజర్ న్యూస్ :** రెమాల్ తుఫానుమరింత తీవ్రం రూపం దాల్చి ఆదివారం రాత్రి బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ తీర ప్రాంతాలను తాకనుండటంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఅత్యవసర సమీక్ష జరిపారు. తుపాను తీవ్రతను తట్టుకునేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లపై ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. ప్రాణనష్టం జరక్కుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, నేవీ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

కాగా, 'రెమాల్' తీరానికి చేరుకోగానే గంటకు 110–120 కిలోమీటర్ల వేగంగా గాలులు వీస్తాయని, వీటి వేగం గంటకు 135 కిలోమీటర్ల వరకూ ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. పశ్చిమబెంగాల్‌లో కోస్తా జిల్లాలో అత్యంత భారీగానూ, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. కాగా, ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పశ్చిమబెంగాల్‌లోని హస్నాబాద్ గ్రామంలో ఎన్డీఆర్ఎఫ్ టీమ్‌ను మోహరించారు. కోల్‌కతా విమానాశ్రయం నుంచి 394 విమాన సర్వీసులను 21 గంటల పాటు సస్పెండ్ చేశారు.

## ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీకాలం పొడిగింపు



**న్యూఢిల్లీ,మేజర్‌న్యూస్ :**ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీకాలాన్ని నెలరోజుల పాటు కేంద్రం పొడిగించింది. ఆయన పదవీకాలం పొడిగింపును కేబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ ఆదివారంనాడు ఆమోదం తెలిపింది. మే 31వ తేదీన ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉండగా, జూన్ 30వ తేదీ వరకూ దానిని పొడిగించింది. ఆర్మీ రూల్స్–1954లోని రూల్ 16ఎ(4)కింద ఆయన పదవీకాలాన్ని పొడిగించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జనరల్ పాండే ఏప్రిల్ 2022న పదవీ బాధ్యతలు చేపట్టగా, అంతకుముందు ఆయన ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా ఉన్నారు.

53

### మోదీ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. నోరు జారిన నితీష్

**పాట్నా,మేజర్ న్యూస్ :** ఎన్నికల ప్రచార ఉధృతితో ఆరితేరిన నేతలు కూడా ఒక్కోసారి తడబడుతుంటారు. జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఆదివారంనాడు పాట్నాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో సరిగ్గే ఇలాగే తడబడ్డారు. నరేంద్ర మోదీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నానని అన్నారు. "దేశవ్యాప్తంగా 400కు పైగా సీట్లలో మేము (ఎన్డీయే) గెలవాలని అనుకుంటున్నాము. నరేంద్ర మోదీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. అప్పుడే భారతదేశం అభివృద్ధి చెందుతుంది, బీహార్ అభివృద్ధి జరుగుతుంది, ప్రతీదీ జరుగుతుంది" అని నితీష్ అన్నారు.

మోదీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్టు నితీష్ చేసిన వ్యాఖ్యలను వేదికపై ఉన్న పలువురు గుర్తించడంతో వెంటనే నితీష్ సర్దుకున్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా ఉన్నారని, ఆయన అలాగే ముందుకు సాగాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. నితీష్ ఇటీవల కూడా ఎన్నికల ప్రచార సభలో పొరపాటున నోరుజారారు. 2020లో మరణించిన రామ్ విలాస్ పాశ్వాన్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ–జేడీయూ–ఎల్జేపీ కూటమిగా ఏర్పడి బీహార్‌లో పోటీ చేస్తున్నాయి.

## కప్పులు కడిగి టీలు అందిస్తూ పెరిగా...



**మీర్జాపూర్,మేజర్ న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. చిన్నతనంలో తాను కప్ ప్లేట్లు కడుగుతూ, టీలు అందిస్తూ పెరిగానని చెప్పారు. మోదీకీ, టీకి మధ్య చాలా లోతైన సంబంధం ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మాట్లాడుతూ, సమాజ్‌వాదీ పార్టీకి ఓటు వేసి దానిని వృథా చేసుకోవద్దన్నారు. సుస్థిరమైన ప్రభుత్వానికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

'ఇండియా' కూటమి నేతల గురించి అందరికీ తెలుసునని, వారు మతతత్వ, కులతత్వవాదులని ప్రధాని విమర్శలు గుప్పించారు. ఎప్పుడు వాళ్ల ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కులం ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటారని అన్నారు. యాదవకులంలో ఎందరో పేరున్న వ్యక్తులున్నప్పటికీ తమ కుటుంబ సభ్యులకే అఖిలేష్ టిక్కెట్లు ఇస్తుంటారని ఎద్దేవా చేశారు. "సమాజ్‌వాదీ నేతలు పట్టుబడిన టెర్రరిస్టులను కూడా విడిచిపెట్టేస్తారు. విభేదించిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తుంటారు. ఉత్తరప్రదేశ్, పూర్వాంచల్‌ను మాఫియాకు స్వర్గధామం చేస్తుంటారు. సమాజ్‌వాదీ ప్రభుత్వంలో లైఫ్ కావచ్చు, ల్యాండ్ కావచ్చు.. ఎప్పుడు లాగేసుకుంటారో ఎవరికీ తెలియదు. మాఫియాను ఓటు బ్యాంకుగా వారు చూస్తుంటారు" అని మోదీ విమర్శలు గుప్పించారు. పవిత్రమైన రాజ్యాంగాన్ని కూడా 'ఇండి' కూటమి ఇప్పుడు తమ లక్ష్యంగా చేసుకుందని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి రిజర్వేషన్లను ఊడలాక్కోవాలనుకుంటోందని అన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఉండరాదని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోందన్నారు. పోలీస్, పీఏసీలో కూడా ముస్లింలకు 15 శాతం రిజర్వేషన్ ఇస్తామని సమాజ్‌వాదీ పార్టీ ప్రకటించిందని, వారి ఓటు బ్యాంకు కోసమే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఊడలాక్కోవాలని అనుకుంటోందని చెప్పారు. పేదలు, దళితులు, వెనుకబడిన తరగతుల వారి కోసం తాము అంకితభావంతో పనిచేస్తామని మోదీ భరోసా ఇచ్చారు.

## వేసవి విజ్ఞాన శిబిరం వల్ల

# ఆలోచన శక్తి పెరుగుతుంది



**పెరవలి, మేజర్ న్యూస్ :** వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం వలన పిల్లల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని రిసోర్స్ పర్సన్ కే వెంకటేశ్వర్లు అన్నారు మే 26వ తేదీ ఆదివారం ముక్కామల ఇనపకోళ్ల రాఘవరావు మెమోరియల్ శాఖాగ్రంధాలయంలో వేసవిజ్ఞాన శిక్షణ(సమ్మర్ క్యాంప్) సందర్భంగా ఉదయం 8 గంటల నుండి 11–30 వరకువిద్యార్థులతో ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. దురాశ నీతి కథను అర్థమయ్యే విధంగా చెప్పడం జరిగింది . విద్యార్థులతో చెస్ , లూడోఆడించడం జరిగింది అనంతరం భారతదేశంలో ఉన్నటువంటి అడవుల రకాలువాటి ఉపయోగాలు అడవులు లేకపోవడం వల్ల జరిగే నష్టాల గురించి చెప్పడం జరిగింది. అనంతరం క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించడమైనది విద్యార్థులతో వారికి ఇష్టమైన కథల పుస్తకాల చదివించి ఇంగ్లీష్ పదాల డిక్టేషను యోగకార్యక్రమాన్ని నిర్వహించడమైనది.

ఈ కార్యక్రమంలో 22మంది విద్యార్థులు రిసోర్స్ పర్సన్స్ కె వెంకటేశ్వర్లు కేకామేశ్వర రావు కే భవాని మధులీల లు పాల్గొనడం జరిగింది విరామ సమయంలో విద్యార్థులందరికీ స్నాక్స్ ,బట్టర్ మిల్క్ఇవ్వడం జరిగిందిఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించడమైనది.

# పాత పైళ్లతో డబ్బులు డ్రా చేసిందెవరు?

**బల్దియాలో ఇంటెలిజెన్స్ పోలీసుల ఆరా**
**కాంట్రాక్టర్లకు అధికారుల మధ్య వారధిపై విచారణ**
**పలువురు ఉద్యోగుల తీరుపైసమాచార సేకరణ**
**200 ఎంబీ బుక్స్ విషయంలోకూ ఎలాగుతున్న అధికారులు**




**వరంగల్ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ పేషీలో ఓ ఉద్యోగి పాత ఫైళ్ల (ఎంబీ బుక్కు)పై బదిలీపై వెళ్లిన కమిషనర్ సంతకాలతో డబ్బులు డ్రా చేసిన వైనంపై ఇంటెలిజెన్స్ పోలీసులు దృష్టి సారించారు. ఈ తతంగంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'పాత ఫైళ్లపై బిల్లులు' అనే కథనం ప్రచురించింది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ఇంటెలిజెన్స్ అధికారులు నాలుగురోజులుగా కూపీ లాగుతున్నారు. నిఘా వర్గాలు బుధవారం నుంచి రంగంలోకి దిగి శనివారం రాత్రి వరకు బల్దియాలోని పలు విభాగాల్లో రహస్య సేకరణ చేశారు. ముందుగా ఇంటెలిజెన్స్ జిల్లా ఉన్నతాధికారి నుంచి ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్, ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఒక లెటర్ తెచ్చి బల్దియా అధికారులకు ఇచ్చి వివరాలు కావాల్సిందిగా కోరారు. అయినా బల్దియా అధికారులు కాలయాపన చేస్తున్నట్టు సమాచారం. అయినా నిఘా వర్గాలు రహస్యంగా వివరాలు సేకరించినట్టు విశ్వసనీయ సమాచారం. తప్పుడు మార్గంలో డబ్బులు దండుకుని పాత కమిషనర్ సంతకాలు చేయించిన 200 ఎంబీ (మెజర్‌మెంట్ పుస్తకం) ఎవరి వద్ద ఉన్నాయి? అవి సంతకాలు చేయించి తీసుకుని వచ్చి ఇంజనీరింగ్, డీబీ(డ్రాయింగ్ బ్రాంచి) నుంచి గ్రీన్ సిగ్నల్ ఇప్పించింది ఎవరు? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఇంకా ఇంటెలిజెన్స్ అధికారులు ఒక ఆడుగు ముందుకు వేసి నక్కలగుట్ట, కాశిబుగ్గ, కాజీపేటలో పనిచేస్తున్న ఇద్దరు ఏఈలను, ఒక డీఈతో పాటు 6గురు డీబీ అధికారులను విచారించి వివరాలు సేకరించినట్టు తెలిసింది. వారు నలుగురు బడా కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పని చేసినట్టు వెల్లడించినట్టు విశ్వసనీయ సమాచారం. 200 ఎంబీ బుక్కులు దొరికేంత వరకు సమస్య ఝఠిలంగానే ఉంటుందని, సేకరించిన వివరాలను రాష్ట్ర అధికారులకు పంపించినట్టు అధికారులు తెలిపారు.

**ప్రధాన పాత్రధారి కోసం వేట**

బల్దియాలో కాంట్రాక్టర్లకు, ఇంజనీరింగ్ అధికారులకు, డీబీ సిబ్బందికి మధ్య సమన్వయకర్తగా వ్యవహరించిన వ్యక్తి పూర్తి వివరాలపై ఇంటెలిజెన్స్ అధికారులు కూపీ లాగుతున్నారు. కాంట్రాక్టర్ల నుంచి ఒక్కో ఎంబీకి రూ.10 నుంచి 20వేలు తీసుకుని అడ్డదారిలో ఎంబీ పుస్తకాలపై సంతకాలు చేయించినట్టు తెలుసుకున్నారు. అలాగే తన సామాజికవర్గానికి చెందిన ఉన్నతాధికారుల అండదండలతోనే తన సామాజికవర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు, డబ్బులు ఇచ్చిన వారికి ఎంబీలపై సంతకాలు చేయించినట్టు తెలిసింది. అయితే సదరు వ్యక్తి గతంలో ఎక్కడ పని చేశాడు? ఇతడికి బల్దియాలో ఎవరు సహకరిస్తున్నారు? 200 ఎంబీ బుక్కులు ఎవరి వద్ద ఉన్నాయి? అనే కోణంలో ఆరాతీస్తున్నారు.

# పాఠశాలల్లో నో బ్యాగ్ డే..

- ప్రతి నెలా మూడో శనివారం అమలు
- అన్ని తరగతులకు డిజిటల్ బోధన
- 9 గంటలకే ప్రారంభం కానున్న బడులు
- కొత్త విద్యా ఏడాదిలో 229 పనిదినాలు
- ఈసారి 20 రోజుల ముందే క్యాలెండర్
- ఏడో తరగతి గణితం బోధనపై స్పష్టత
- పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్



**హైదరాబాద్,మేజర్‌న్యూస్ :**విద్యాసంవత్సరం ప్రారంభమైందంటే స్కూల్ బ్యాగ్స్‌పై చర్చ పెద్దఎత్తున జరుగుతుంది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బరువు కంటే వారి పుస్తకాల బరువు ఎక్కువగా ఉంటోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చిన్నారులకు వెన్నెముక సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం అమలు చేయనుంది. నెలకో రోజు 'నో బ్యాగ్ డే'గా ప్రకటించింది. ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులు పాఠశాలకు పుస్తకాలు లేకుండా రావాల్సి ఉంటుంది. ఆ రోజు విద్యార్థుల బోధనకు సంబంధించి ఎస్సీఈఆర్టీ ప్రత్యేక ప్రణాళిక ప్రకటించనుంది. ఈ విధానం కొత్త విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు దీనిని తప్పనిసరిగా పాటించాలి. కొత్త విద్యా సంవత్సరం వచ్చే నెల 12 నుంచి ప్రారంభమై 2025 ఏప్రిల్ 23న ముగుస్తుంది. దీనికి సంబంధించిన అకడమిక్ క్యాలెండరును పాఠశాల విద్యా శాఖ శనివారం విడుదల చేసింది. ఫార్మేటివ్ అసెసమెంట్ (ఎఫ్ఏ), సమ్మేటివ్ అసెసమెంట్ (ఎస్ఏ) పరీక్షలతో పాటు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించే తేదీలు ప్రకటించింది. మార్చి 2025లో పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం సంవత్సరంలో 229 పనిదినాలు ఉన్నాయి. అన్ని తరగతులకు సాఫ్ట్‌నెట్ ద్వారా డిజిటల్ తరగతుల బోధన తప్పనిసరి చేశారు. ప్రతీ రోజు 20–25 నిమిషాల పాటు ఈ ప్రసారాలు ఉంటాయి. ప్రసారాలకు ముందు ఉపాధ్యాయులు 5 నిమిషాల పాటు ఆ రోజు తరగతికి సంబంధించి విద్యార్థులకు వివరించాలి. పాఠ్యాంశాలపై విద్యార్థులకు లోతైన అవగాహనకు ఈ విధానం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. నైతిక విలువలు, లైఫ్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతీ రోజు ప్రార్థన సమయంలో 5 నిమిషాలు యోగా/ధ్యానం కోసం కేటాయించారు.

**ఏడో తరగతి గణితంపై స్పష్టత**

6,7 తరగతులకు గణితం ఎవరు బోధించాలన్న విషయంపై గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో వివాదం నెలకొంది. మ్యాథ్స్ టీచర్, సైన్స్ టీచర్‌లో ఈ బాధ్యతను ఎవరు నిర్వర్తించాలన్న విషయంపై స్పష్టత లేకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు గణిత బోధనకు దూరమయ్యేవారు. ఈ అంశంపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఈ అకడమిక్ క్యాలెండరులో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. 6, 7 తరగతుల గణిత శాస్త్రాన్ని ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ బోధించాలని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

**20 రోజుల ముందే క్యాలెండర్**

అకడమిక్ క్యాలెండరును ప్రతీ ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ఒక రోజు ముందు ప్రకటిస్తుండగా ఈసారి 20 రోజుల ముందు ప్రకటించడంపై విద్యా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ప్రభుత్వ నిర్ణయంతో విద్యా ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు సమయం లభిస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే జంగయ్య, చావ రవి పేర్కొన్నారు. 9 గంటలకే పాఠశాలలు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వేళలు గతంలో ఉదయం 9.30 నుంచి ఉండగా దీనిని 9 గంటలకు మార్చారు. ప్రాథమిక పాఠశాలల (1–5 తరగతులు) ఉదయం 9 నుంచి 4, హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 3.45 వరకు ఉంటాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి 4.15 వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 వరకు పనిచేస్తాయి. ఇవి రెండూ జంట నగరాల్లో ఉదయం 8.45 నుంచి 4 గంటల వరకు ఉంటాయి.

## రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో మౌనికకు బంగారు పతకం



**అంబాజీపేట, మేజర్‌న్యూస్ :** ఈ నెల 21 నుండి 24 వరకు విజయవాడ మేరీస్టెల్లా కళాశాలలో కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో అంబాజీపేటకు చెందిన మీసాల మౌనిక ప్రతిభను కనబర్చి బంగారు పతకాన్ని సాధించింది. వైస్ కెప్టెన్ మౌనిక అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ పోటీలు 7వ ఏపీ యూత్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ (బాలురు, బాలికలు) లకు నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కెప్టెన్ మానస, వైస్ కెప్టెన్ మౌనికతో పాటు మరో పది మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రీడాకారులు కడప, గుంటూరు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టులపై గెలిచి తుది పోరులో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచినట్లు మౌనిక తెలిపింది. రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ అందుకున్న మౌనికకు క్రీడాకారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## తీపర్రు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం




**పెరవలి, మేజర్‌న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు శాఖ గ్రంథాలయంలో మే 26వ తేదీ ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథలు చదివించడం కథలు వినిపించడం వారికి నచ్చిన పుస్తకం చదివించడం జరిగినది రిసోర్స్ పర్సన్ మిర్యాల ప్రియాంక విద్యార్థులకు మ్యాథమెటిక్స్ మరియు హిందీ వర్డ్స్ చెప్పడం జరిగినది యోగ ధ్యానం చెప్పడం జరిగినది ఇన్నర్ గేమ్స్ ఆడించడం జరిగినది. విరామ సమయంలో స్నాక్స్ పంచడం జరిగినది. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని తీపర్రు శాఖా గ్రంథాలయం గ్రంథ పాలకురాలు సిహెచ్ వెంకట జయలక్ష్మి తెలియజేశారు.

## తెలుగుదేశం సీనియర్ నాయకులు గోలి వెంకట్రావు మృతి



**సామర్లకోట, మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోలి వెంకట్రావు (60) ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయం ఒక్కసారిగా గుండెపోటుకి గురైన వెంకట్రావును హుటాహుటిన ఒక్క ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తున్న సమయంలో మరొకసారి గుండెపోటు రావడంతో వెంకటరావు మృతి చెందారు. గతంలో పెద్దాపురం టిడిపి శాసన సభ్యులు గా పనిచేసిన బొడ్డు భాస్కర రామారావుకు అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఈయన భార్య గోలి అనంత లక్ష్మి సామర్లకోట మండల ప్రెసిడెంట్ గా కూడా పని చేశారు. ప్రస్తుతం ఈయన కుమారుడు గోలి శ్రీరాం వేట్ల పాలెం వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. కొంతకాలం వైసీపీ పార్టీలో కొనసాగిన గోలి మరలా ఇటీవల టిడిపిలో చేరారు.

## బాబోయ్.. తీరానికి తుపాన్ వచ్చేస్తోంది..!




**బంగ్లాదేశ్,మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ ఉదయం తీవ్ర తుపాన్‌గా మారినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ప్రసుత్తం ఉత్తర దిశగా కదులుతూ.. బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ వద్ద రెమల్ తుపాన్ ఈరోజు రాత్రి తీరం దాటే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 100నుంచి 135కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించారు. దీని ప్రభావం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలపై ఉంటుందన్నారు. హెచ్చరికలు జారీ..మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇవాళ రేపు మత్స్యకారులు సముద్ర తీరానికి వెళ్లొద్దని, ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెమల్ తుపాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై అంతగా ఉండదన్నారు. ఉత్తరాంధ్రలో ఒకటి రెండు చోట్ల చెదురుమదురుగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రేపట్నుంచి రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.

ఒడిశా, పశ్చిమబెంగాల్ తీర ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కోస్ట్‌గార్డ్‌ను సైతం అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హౌరా, హుగ్లీ, తూర్పు, మిడ్నాపూర్, కోల్‌కతాలో గంటకు 70–80కి.మీ. వేగంతో గాలులు వీచనున్నట్లు తెలిపారు. తీర ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు.